ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 29 జనవరి 2024 | 5

చంద్రబాబుకు భారీ స్వాగత ఏర్పాట్లు

అక్రమ కేసుల్లో 53 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధానికి గురై విడుదలై వెళ్లిన తర్వాత బహిరంగ సభలో పాల్గొనేందుకు తొలిసారిగా జిల్లాకు వస్తున్న నారా చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలకడానికి నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చంద్రబాబు చేరుకుంటారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం పలక నున్నారు. అక్కడ నుంచి కారులో సభకు చేరుకుంటారు.

నేడే.. రా కదలిరా!

- కాతేరులో బహిరంగ సభ
- ఉదయం 10 గంటలకు ఆరంభం
- 2 లక్షల మంది వస్తారని అంచనా
- 23 ఎకరాల్లో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఇక కొద్ది రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల శంఖారావం పూరించడానికి తూర్పుగోదావరి సిద్ధమైంది. వచ్చే ఎన్నికలకు కేడర్, ప్రజలను సిద్ధం చేయడానికి, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన అధికార వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సోమవారం తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలోనూ జిల్లా స్థాయి బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. లక్షలాది మందికి స్వాగతం పలకడానికి కాతేరు గ్రామం ముస్తాబైంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సభ జరగనుంది.గోదావరి ఫోర్త్ బ్రిడ్జి సమీపంలోని కాతేరులోని తిరుమల విద్యాసంస్థల సమీపంలోని 23 ఎకరాల విశాలమైన మల్లు లేఅవుట్‌లో బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. పెద్ద వేదికతో పాటు సభకు హాజరయ్యేవారికి ఇబ్బందిలేకుండా భారీకేడ్లతో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వేదిక మీద సుమారు 100 మంది కూర్చునేటట్టు సిద్ధం చేశారు.వేదిక ముందు 10 వేల మంది వీఐపీలు కూర్చునేలా కుర్చీలు వేసి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు.మరో పక్క మీడియాకు ఏర్పాట్లు చేశారు. 2 లక్షల మంది పట్టే విధంగా విశాలమైన గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. ప్రాంగణం ఫ్లెక్సీలు, పసుపు జెండాలతో ధగధగ వెలిగిపోతోంది. సమీపంలోని తిరుమల కాలేజీ ప్రక్కన హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతారని సమాచారం. ఒక్కో నియోజకవర్గం నుంచి 30 వేల మంది వచ్చేటట్టు ఆయా నేతలు బాధ్యతలు తీసుకున్నారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ఆయా నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఉదయం 10గంటలకే ప్రారంభమవుతుంది. చంద్రబాబు సుమారు 11.25 గంటలకు సభకు చేరుకుని, 1గంటకు తన ఉపన్యాసం ముగిస్తారు. సభ ఏర్పాట్లను మూడు రోజుల నుంచి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు,మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రులు కెఎస్ జవహర్, ప్రత్తిపాటిపుల్లారావు, గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ, జోన్-2 పరిశీలకుడు మండలపు రవి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం కూడా వారు ఇక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.సభకు టీడీపీ, జనసేన క్యాడర్ తరలిరానుంది. నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15 గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వస్తారు.అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45 గంటల నుంచి ఒంటి గంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు.అనంతరం 1.50 గంటలకు బయలుదేరి కాతేరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం వెళతారు.


తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం


ఫ్లెక్సీల ఏర్పాటు


సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలి స్తున్న మాజీ మంత్రులు యనమల, చినరాజప్ప, గోరంట్ల,జవహర్ తదితరులు

కోట సత్తెమ్మకు మహా నివేదన



నిడదవోలు, జనవరి 28 : తిమ్మరాజు పాలెం కోటసత్తెమ్మను ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనం తరం అమ్మవారికి క్షీర నివేదన మహనివేదన చేశారు. అమ్మవారికి ఆదివారం ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,01,884లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.

పెదనాన్నే కామ పిశాచి!

మరదలి కుమార్తెను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పెదనాన్నే కామ పిశాచిగా మారి కుమార్తెను వేధిస్తున్న ఘటన రాజమహేంద్రవరంలో చోటు చేసుకుంది. భర్తతో విభేదాల కారణంగా ఓ వివాహిత కొన్నేళ్లుగా తన ఇద్దరు కుమార్తెలతో దేవీచౌక్‌లో నివాసం ఉంటూ షాపుల్లో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. పెద్ద కుమార్తె పది, రెండో కుమార్తె తొమ్మిది చదువుతున్నారు. అయితే ఇదిలా ఉండగా వివాహిత అక్క భర్త ప్రసాద్ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళుతుంటాడు. ఇదిలా ఉండగా ఈ నెల 18వ తేదీన వివాహిత ఇంటికి వచ్చేసరికి అతడు కంగారుగా పరిగెత్తుకుని వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొంది.కుమార్తెను నిలదీయగా నాలుగు నెలల నుంచీ తనను లైంగికంగా వేధిస్తున్నాడని చెప్పిందని వాపోయింది.ఈ మేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పోక్సో కేసు నమోదు చేశారు.

మొక్కు తీరకుండానే మృత్యుఒడికి..

వ్యాన్ తొట్టి ఢీకొని యువకుడి మృతి

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుడికి మొక్కు తీర్చుకుందామని వెళ్లిన ఆనందం ఆ కుటుంబంలో గంటల్లో ఆవిరైపోయింది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా కొత్తగాజువాకకు చెందిన గొర్ల నాయుడు(26) ఏవీ అప్పారావు రోడ్‌లో అక్కాబావ దగ్గర ఉంటున్నాడు. తన బావ అప్పల నాయుడు సూపర్‌వైజర్‌గా పనిచేసే రెస్టారెంట్లో ఉద్యోగం చేస్తున్నాడు. మొక్కు తీర్చుకోవడానికి కుటుంబీకులతో కలిసి ఆదివారం కేశవరంలోని గుడికివెళ్లాడు. ఏవో సరుకులు అవసరం కావడంతో రాజమహేంద్రవరం వచ్చి తిరిగి వెళుతుండగా రాజవోలు రోడ్డులో పక్కనే వెళ్తున్న పౌర సరఫరాల బియ్యం రవాణా చేసే వ్యాన్ తొట్టి వెనుక భాగం అతడి తలకు బలంగా తగిలింది.దీంతో నాయుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జుబేర్ తెలిపారు.



మాట్లాడుతున్న ఏపీ అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

హామీల అమలు జీవోలు విడుదల చేయాలి

అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 : అంగన్వాడీలకు జగన్మోహన రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీల సమ్మె జనవరి 22 అర్ధరాత్రితో ముగిసిందని, అయితే ఇది పోరాటం ముగిసినట్టు కాదని తాత్కాలిక విరామమేనన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ యూనియన్ ఇచ్చిన 11 డిమాండ్లలో 9 డిమాండ్లపై నిర్దిష్టంగా ఆదేశాలు ఇస్తామని జగన్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండు వరకూ ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన పోలవరం


పోలవరం ప్రాజెక్టు వద్ద సా..గుతున్న పనులు

- నేటికీ ముందుకు సాగని పనులు
- టీడీపీ హయాంలోనే పనుల్లో వేగం
- నేడు తూతూమంత్రంగా జరుగుతున్న వైనం
- ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి సీఫేస్
- దానిని తోడడానికి 40 పైపులు
- కేవలం వైబ్రో కాంపాక్షన్ పనులతో కాలక్షేపం
- ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గాలికే
- స్పిల్‌వే మాత్రమే పూర్తి..
- ప్రధాన కాలువల సంగతేంటి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు కళ తప్పింది. ఈపాటికే పూర్తయ్యి నీటి ప్రవాహంతో కళకళలాడాల్సిన ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.ప్రస్తుతం స్పిల్‌వే పూర్తయినా.. ప్రధాన కాలువలు పూర్తి కానందున కనీసం గ్రావిటీ ద్వారా కూడా స్పిల్‌వే నుంచి ప్రధాన కాలువలకు నీరు పంపే పరిస్థితి లేదు. ప్రధాన డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) పూర్తి చేసి, కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ఈ ప్రాజెక్టుకు ఒక రూపు వస్తుంది. ఇప్పటి వరకూ కేవలం స్పిల్‌వే గేట్లు పెట్టి నీటిని వదలడానికి వీలుగా పూర్తి చేశారు.ఇవి ఇంచుమించు పనులు పూర్తయినట్టే. స్పిల్ వే అంటే ఓ బ్యారేజీ మాత్రమే. ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా రాజకీయకోణం నుంచి చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నట్టు కనిపిస్తోంది. 2019 ఎన్నికల ముందు టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు చూడడానికి వెళితే వందలాది యంత్రాల హోరుతో పనులు జరిగేవి. ప్రస్తుతం పనులు తూతూమంత్రంగా జరుగుతున్నాయి.కేవలం రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య ఇసుక ఫిల్లింగ్ ఓ మాది రిగా చేస్తూ దానిని రెండు యంత్రాలతో వైబ్రోకాంపాక్షన్ చేస్తున్నారు. అంటే ఇసుకను అక్కడ గట్టిగా కూరి గట్టి పరుస్తున్నారు. మరో పక్క ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి లీకవుతున్న నీటిని తోడుతున్నారు.ఇంకో పక్క పవర్ ప్రాజెక్టు టన్నెల్స్ ఇనుప ఊచలతో లైనింగ్ పనులు నెమ్మదిగా చేస్తు న్నారు.ఇంత కంటే ఇక్కడ జరిగే పనులేవీ కనిపించడంలేదు.

ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి వాటర్ సీఫేస్

ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి గోదావరికి అడ్డుగా ఎగువ,దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ రెండు డ్యామ్‌ల మధ్యనే ఈసీఆర్ఎఫ్ నిర్మిస్తారు. ప్రస్తుతం ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన గోదావరి నీరు కొంత నిల్వ ఉంది. అదే స్పిల్‌వే గేట్ల గుండా రాజమహేంద్రవరం వైపు అంటే ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వైపు వస్తుంది.ఇంత వరకూ ఇబ్బందిలేదు .కానీ పర్యవేక్షణ సరిగా లేకపోవడం వల్ల కాఫర్ డ్యామ్ నుంచి వాటర్ లీకేజీ అవుతుంది. ఇది కేవలం సీఫేస్ మాత్రమేనని దీని వల్ల ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు.ఈ నీరు ఉన్న చోట ఓ మాదిరిగా కాలువ చేసి డయా ఫ్రమ్‌వాల్ నిర్మించిన ప్రాంతం నుంచి దిగువ కాఫర్ డ్యామ్ వద్దకు మళ్లించి అక్కడ నుంచి పంపుల ద్వారా దిగువ కాఫర్ డ్యామ్ దిగువకు తోడేస్తున్నారు. సుమారు 40 పంపులు ఇక్కడ అమర్చారు.

వైబ్రో కాంపాక్షన్ పనులతో కాలక్షేపం

ఎగువ ,దిగువ కాఫర్ డ్యామ్ వల్ల ప్రధాన ప్రాజెక్టు నిర్మించే ప్రాంతంలో డయాఫ్రంవాల్‌కు అటూఇటూ ఖాళీ స్థలాల్లో ఇసుక డంపింగ్ చేస్తున్నారు. దానిని రెండు భారీ యంత్రాలతో ఇసుకను నొక్కి గట్టి పరుస్తున్నారు.దీనిని వైబ్రో కాంపాక్షన్ అంటారు. ఇసుక డంపింగ్ కూడా భారీగా లేదు.సుమారు 20 నుంచి 30 లారీల ద్వారా గోదావరి ఇసుకను మరో చోట నుంచి ఇక్కడకు తరలిస్తున్నారు. ఇక్కడే యంత్రాలు కనిపిస్తున్నాయి.ఈ పనులతోనే ఏదో పోలవరం పూర్తిచేస్తున్నట్టు కాలక్షేపం చేస్తున్నారు.

యంత్రాలకు పని లేదు

మెయిన్ డ్యామ్ పనులు మొదలు కాకపోవడంతో యంత్రాలకు పనిలేకుండా పోయింది. కొన్ని లారీలతో ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో కొన్ని యంత్రాలు, వాహనాలు కొండ మీద పార్కింగ్ ప్రాంతాలలోనే కనిపి స్తున్నాయి.కొన్ని యంత్రాలకు ముసుగులేసేశారు. పోల వరం ప్రాజెక్టు ఎత్తు 53 మీటర్ల నిర్మించాలి. ప్రస్తుతం 41.5 మీటర్ల ఎత్తువరకూనిర్మించనున్నట్టు చెబుతు న్నారు.. ఇది మొదటి దశ అంటున్నారు. ఇది కూడా ప్రస్తుతం వినియోగంలో వచ్చినట్టు లేదు.

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్ ఏదీ..

ప్రధాన డ్యామ్ అయిన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పూర్తయితేనే పోలవరం ప్రాజెక్టు రిజర్వాయరు నిర్మించినట్టవుతుంది. కానీ దీని నిర్మాణానికి గోదావరి నదిలో నిర్మించిన డయాఫ్రం వాల్ అధిక వరదల వల్ల కొద్ది మేర దెబ్బతిన్నట్టు అధికారులు ధ్రువీకరించారు.దీనికి మరమ్మతులు చేయాలా..ప్రత్యామ్నాయంగా మరొకటి నిర్మించాలా అనేది నిర్ణయించాల్సి ఉంది. కానీ ఉన్నతాధికారులు కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తేనే మంచిదని లేఖ రాసినట్టు సమాచారం.ఇది అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. డయా ఫ్రంవాల్ విషయం తేలిన తర్వాత, ఈసీ ఆర్ఎఫ్ వాల్ డిజైన్ చేసి అసలు ప్రాజెక్టు నిర్మిస్తారు.

పోలవరం ప్రాజెక్టు ప్రాంతం


ఎక్కడి పనులు అక్కడే..

ప్రస్తుతం గోదావరికి అడ్డంగా ఎగువ కాఫర్ డ్యామ్ సుమారు 42.5 మీటర్ల ఎత్తున నిర్మించారు. దీంతో వరద సమయంలో ఫారెస్ట్‌లోని గ్రామాలు, పాపికొండల ప్రాంతం బాగా మునిగిపోతుంది. అప్పుడు స్పిల్‌వే కూడా కిందకు వదిలేసి ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు ఎత్తితే అది సముద్రంలోకి పోతుంది.ప్రస్తుతం వరదలు లేక ఎగువ కాఫర్ డ్యామ్ పైన ఓ మోస్తరు మాత్రమే నీరుంది.గత ప్రభు త్వంలో మొదట ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మా ణం పూర్తయిన వెంటనే స్పిల్‌వే గుండా గ్రావిటీ అంటే వరద రూపేణా వచ్చిన నీటిని ముందు కాలువలకు మళ్లించాలనే ఉద్దేశంతో కాలువల పనులు చేపట్టారు.పోలవరం ప్రాజెక్టు సమీపంలో కొద్దిగా మినహాయించి మిగతా కుడి ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కాలువలోకి నీరు మళ్లించి కృష్ణానదికి అనుసంధానం చేసిన సంగతి తెలిసిందే. అదే సమయంలో ఎడమ ప్రధాన కాలువ పనులు వేగవంతంచేసి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మించి దాని ద్వారా ఏలేరు రిజర్వాయరుకు కొంత నీటిని మళ్లించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ ప్రధాన కాలువల పనులు ఆగిపోయాయి.కుడి ప్రధాన కాలువ పని చాలా వరకూ పూర్తయినప్పటికీ.. ఎడమ ప్రధాన కాలువ పనులు ఆగిపోయాయి. కాలువ పనులు పూర్తయితే కనీసం స్పిల్‌వే గుండా గ్రావిటీ ద్వారానైనా వరదల సమయంలో నీటిని మళ్లించవచ్చు, కుడి ప్రధాన కాలువ ద్వారా కృష్ణా, ఎమడ ప్రధాన కాలువ ద్వారా విశాఖకు నీటిని మళ్లించవచ్చు. ఈ కాలువ పనులను వదిలేశారు.ఇవి వదిలేసి ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు డిజైన్ రాలేదని,డయా ఫ్రంవాల్ మరమ్మతు చేయాలా,ప్రత్యామ్నాయం నిర్మించాలా అనేది తేలలేదని, అవి రెండూ నిర్ణయాలు జరిగిన తర్వాతే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనులు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో 2021కే పూర్తి కావలసిన ప్రాజెక్టు 2025 జూన్‌కు మారింది.మరో పక్క పెరిగిన నిర్మాణ అంచనాలపై కేంద్రం నుంచి స్పష్టత లేదు. గత ప్రభుత్వంలో ఆమోదం తెలిపిన కేంద్రం, ప్రస్తుతం రకరకాల కారణాలు చెబుతోంది. మరో ప్రక్క ప్రస్తుతం పనులు చేసిన కాంట్రాక్టు సంస్థకు సుమారు రూ.1000 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. మరో ప్రక్క పునరా వాసం సంగతి గాలిలోనే ఉంది. ఇంకా అనేక కాలనీలు నిర్మించాల్సి ఉంది. గ్రామాలను తరలించాల్సి ఉంది.కొన్ని మండలాల ప్రజలను తరలించారు.కానీ వారికి కాలనీలు పూర్తిగా నిర్మించి ఇవ్వలేదు.


మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు

ఆర్యవైశ్యులు రాజ్యాధికారం సాధించాలి!

ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభలో నాయకుల తీర్మానం 6లో..

నెల రోజుల్లో జైళ్లలో ఉన్న బాలల గుర్తింపు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జైళ్లలో బాలబాలికలు ఉంటే గుర్తించి వారికి తగు న్యాయ సహాయం చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి తెలి పారు. యువత పునరుద్ధరణ పేరుతో నల్సా ప్రారంభించిన దేశవ్యాప్త కార్యక్ర మంలో భాగంగా కేంద్ర, మహిళా కారాగాలను ఆదివారం సందర్శించి మాట్లా డారు. చట్టంతో విభేదించిన పిల్లలు వారి వయసును న్యాయస్థానాల్లో నిరూపిం చుకోవడానికి అవసరమైన చట్టపరమైన సహాయాన్ని అందించే లక్ష్యంతో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 27వ తేదీ వరకూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామన్నారు. అర్హులైన వాళ్లు న్యాయ సహాయం కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లేదా కారాగారంలోని పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అభ్యర్థనను డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని కోరారు.


సభకు హాజరైన టీచర్లు, ఉద్యోగులు

ఓపీఎస్ సాధిద్దాం!

ఓపీఎస్ మన హక్కు.. పోరాడదాం.. సాధించుకుందాం.. సీపీఎస్.. జీపీఎస్ మనకెందుకు.. జీపీఎస్ ఇచ్చే పార్టీలకే ఓటేద్దాం అంటూ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రతినబూనారు. ఓపీఎస్ రాష్ట్ర వ్యాప్త సాధన సభ ఆదివారం ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో రాజమహేంద్రవరంలో నిర్వహించారు.ఈ సభకు సుమారు 5 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు.. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యమ కార్యాచరణకు దిగుతామని హెచ్చరిక చేశారు. - వివరాలు 6లో

రాముడు గెలిచాడు..


సభకు హాజరైన భక్తజనం

జై శ్రీరామ్.. .జై శ్రీరామ్ నినాదాలతో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం మార్మోగింది. హిందూ సంగమ సభ ఆదివారం ఘనంగా జరిగింది.. 500 ఏళ్ల తరువాత రాముడు గెలిచాడని కాకినాడ శ్రీ పీఠం స్వామీజి పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. మాత మార్పిడులను అరికట్టాలన్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున హిందువులు తరలివచ్చారు. ప్రాంగణం అంతా జై శ్రీరామ్ నినాదాలతో ఉన్న కాషాయం జెండాలతో నిండిపోయింది.. - వివరాలు 6లో



జేఎన్టీయూకే పట్టాల పండుగ

రాష్ట్రంలో అతిపెద్ద సాంకేతిక విశ్వవిద్యాలయమైన కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవాన్ని ఈనెల 31న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 10వ స్నాతకోత్సవ నిర్వహణకు ఇప్పటికే విశ్వవిద్యాలయ కులపతి, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ కె.హేమ చంద్రారెడ్డి ఆమోదం తెలిపారు.

31న జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం

వర్సిటీ ఆవరణలో చురుగ్గా ఏర్పాట్లు

టీసీఎస్ ప్రెసిడెంట్‌కు గౌరవ డాక్టరేట్

ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉపకులపతి.



వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నాం. ఇది ప్రతీ విద్యార్థి జీవితంలో మరచిపోలేని వేడుక కులపతి హోదాలో హాజరవుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా విద్యార్థులకు పట్టాలు, పతకాలు, పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నారు. స్నాతకోత్సవాన్ని ప్రణాళికా బద్ధంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

పట్టాల ప్రదానం ఇలా..

10వ స్నాతకోత్సవంలో 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించి బీటెక్-34199, బీఫార్మసీ 1477, బీబీఏ-21, ఫార్మా డీ-182, బీఆర్క్-18 మొత్తం యూజీలో 35,897 (ఒరిజినల్ డిగ్రీ) పట్టాలను ప్రదానం చేయనున్నారు. అదే విధంగా ఎంటెక్-1689. ఎంబీఏ-1093, ఎంసీఏ-343, ఎం ఫార్మసీ-32 మొత్తం పీజీలో 1468 ఓడీ పట్టాలను, 24 మంది విద్యార్థులకు బంగారు, 4 నగదు పతకాలను, సుమారు 64 మందికి పీహెచ్‌డీ పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేయనున్నారు. స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకునేందుకు 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు.

గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక

జేఎన్టీయూకే, జనవరి 28: 2008లో విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకున్న జేఎన్టీయూకే మొదటి ఉపకులపతిగా అల్లం అప్పారావు, రెండో వీసీగా జి.తులసీరామ్‌దాస్, 3వ వీసీగా వీఎస్ఎస్‌కుమార్, 4వ వీసీగా ఎం.రామలింగరాజు వ్యవహరించగా 5వ వీసీగా ప్రస్తుతం జీవీఆర్ ప్రసాదరాజు కొనసాగుతున్నారు. స్నాతకోత్సవానికి కులపతి హోదాలో హాజరు కావాలని వీసీ జీవీఆర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలోని వర్సిటీ బృందం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానపత్రికను అందించింది. మాజీ ఉపకులపతి అల్లం అప్పారావు హయాంలో జేఎన్టీయూకే 1వ స్నాతకోత్సవాన్ని, డాక్టర్ జి.తులసీరామ్‌దాస్ హయాంలో 2,3,4వ స్నాతకోత్సవాలను, వీఎస్ఎస్ కుమార్ హయాంలో 5, 6వ స్నాతకోత్సవాలను, ఎం.రామలింగరాజు హయాంలో 7వ స్నాతకోత్సవాన్ని నిర్వహించగా ప్రస్తుత ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్‌ప్రసాదరాజు హయాంలో 8,9వ స్నాతకోత్సవాలను ఇప్పటికే నిర్వహించగా ఈనెల 31న పదో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అతిథులు వీళ్లే..

జేఎన్టీయూకే కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మాజీ నేవీ రయర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ ఉపన్యాసం ఇస్తారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారని వర్సిటీ వర్గాలు తెలిపాయి. జేఎన్టీయూకే తరఫున గౌరవ డాక్టరేట్‌ను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు ప్రదానం చేయనున్నారు. అంతే కాకుండా స్నాతకోత్సవానికి మాజీ ఉపకులపతులు, పాలక మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని అధికారులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించినట్లు తెలిపారు.

ఓపీఎస్ ఇచ్చే పార్టీలకే
ఉద్యోగుల ఓటు

సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించాలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు

ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ

ఓట్ ఫర్ ఓపీఎస్ సభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటీఎఫ్ నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించే రాజకీయ పార్టీలకే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రవ్యాప్త పాత పెన్షన్ సాధన సభ నిర్వహించారు. ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ నినాదాలు చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల న్యాయమైన ఆందోళనా కార్యక్రమాలను ప్రభుత్వం పోలీసుల సహకారంతో అణచివేయాలనుకోవడం సరికాద న్నారు. ఉపాధ్యాయులను హేబిట్యువల్ అఫెండర్స్ (అలవాటైన నేరస్తులు)గా పరిగణించడం దారుణమని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓపీఎస్‌ను తమ మేనిఫెస్టోలో చేర్చడంతో పాటు మొదటి సంతకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీపీఎస్ డొల్ల అని, గ్యారంటీ లేని పెన్షన్‌కు గ్యారంటీ అని పేరు పెట్టడం విడ్డూరమని అన్నారు. ఉపాధ్యాయులంతా ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 నుంచి మండల స్థాయిలో, 18 నుంచి 21వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయిలో, 25 నుంచి 28వ తేదీ వరకూ జిల్లాస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేయాలని చెప్పారు. మార్చి 15 తర్వాత చర్చా వేదికలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనకు జరిగే పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచి మద్దతు లభించకపోతే శాసనసభలకు సొంతంగా ప్రతినిధులను పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాలమైన ప్రజా సమీకరణతో ఎవరు ముఖ్యమంత్రి అవ్వాలో నిర్ణయించే శక్తిగా మారాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, అరుణకుమారి, గోపి, మూర్తి, జ్యోతిబసు, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఉద్యోగులు, సంఘాల నేతలు

ధర్మవరంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వరుపుల సుబ్బారావు



ప్రత్తిపాడు, జనవరి 28: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. పేర్రాజు చెరువు సమీపంలోని పుష్కర కాలువ గట్టుపై ఈ పోటీలు నిర్వహించగా పోటీలను మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుమ్మలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జతకు ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి జిల్లాలోని చెముడులంకకు చెందిన నాగిరెడ్డి నారాయుడుకు చెందిన ఎడ్ల జతకు తృతీయ బహుమతి లభించింది. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా కొవ్వాడకు చెందిన మట్టా నవనీన్ శ్రీ మణికంఠ ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన బదిరిశెట్టి మణి ఎడ్ల జత ద్వితీయ స్థానం, అనకాపల్లిజిల్లా చౌడవాడకు చెందిన గెడ్డం అప్పారావు ఎడ్ల జతకు తృతీయస్థానం లభించాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ జువ్వల సుజాతబాబులు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ పోటీలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణ, తెలంగాణాకు చెందిన 43 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో 7 ఎడ్ల జతలు, జూనియర్స్ విభాగంలో 36 ఎడ్ల జతలు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా ఈ పోటీలు నిర్వహించడంతో పేర్రాజు చెరువు పుష్కర కాలువ గట్టు జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎడ్ల జతలు రావడంతో ఎడ్లకు అవసరమైన తాళ్లు, కొరడాలు, ఇతర సామగ్రి అమ్మకం దుకాణాలు పోటీల ప్రదేశాల్లో వెలిశాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా చేకూరి రామకృష్ణ, యనమల కృష్ణ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు. విజేతలకు షీల్డ్ , నగదు బహుమతులు అందించారు. బహుమతుల దాతలుగా ముదునూరి మురళీకృష్ణంరాజు, బి.సుశీల అబ్బాయి, కిల్లాడి బాబ్జి, ఇంధన ఏసుబాబు బాబ్జి, ఫైలా ఏసుబాబు, చెక్కపల్లి రాంబాబు తదితరులు వ్యవహరించారు. పెద్దలు దాట్ల అప్పన్నబాబు, జువ్వల చినబాబు, కోలా తాతబాబు, బొల్లు సీతారామరాజు, జె. బాబులు, సానా నూకరాజు, దాడి చిన్నారావు, దొడ్డిపట్ల సోమన్నదొర తదితరులు తోడ్పాటు అందించారు.

500 ఏళ్ల తర్వాత
రాముడు గెలిచాడు

గుడికట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందాం

శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ

రాజమహేంద్రవరంలో వైభవంగా హిందూ సంగమం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కల్చరల్, జనవరి 28: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ఆదివారం సాయంత్రం 'జై శ్రీరామ్.. భారత్ మాతాకీ జై.. వందేమాతరం' నినాదాలతో మార్మోగింది. కాషాయ జెండాలు కళకళలాడాయి. శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ హిందూ సంగమం అంగరరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది హాజరయ్యారు. శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ 'భారతదేశ ఉనికి, అస్తిత్వం 2024 జనవరి 22న ప్రారంభమైందన్నారు. ఆ రోజున ప్రపంచమంతా భారతదేశ గొప్పతనం, అయోధ్య నగరి వైపు చూసిందని తెలిపారు. '524-25 మధ్యలో అయోధ్యలో రామమందిరాన్ని కూల్చేశారు. 500 ఏళ్ల తర్వాత సర్వోన్నత న్యాయస్థానంలో రాముడు గెలిచాడు. రామ మందిరాన్ని నిర్మించుకున్నాం. ప్రధాని మోదీ దేశంలోని ఉజ్జయిని అనే క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. జ్యోతిర్లింగమైన కేదారినాథ్‌ని ఉద్ధరించి చూపించారు' అని తెలిపారు. శ్రీశైలం క్షేత్రానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయబోతున్నట్లు చెప్పారు. గుడి కట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందామా..గుడి కొట్టేవాడికి ఓటేద్దామా?..మన ఓటు గుడి కట్టేవాడికి మాత్రమే వేయాలని పిలుపునిచ్చారు. హిందూపురంలో కాషాయాన్ని ఎగురవేసి చూపిస్తామన్నారు. ఏప్రిల్‌లో మనం మన చూపుడు వేలుతో సిద్ధంగా ఉండాలి. బేషరతుగా జైశ్రీరాం అంటూ పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి పువ్వు కనిపిస్తే ఓటేయాలి' అని పరిపూర్ణానంద పిలుపునిచ్చారు. హిందూ జాగరణ సమితి నాయకుడు అలే శ్యాం మాట్లాడుతూ హిందువులంతా సంఘటితంగా ఉంటే భారతదేశం బలమైన శక్తిగా విరాజిల్లుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా ఇంకా మనకు పూర్తి స్వాతంత్ర్యం రాలేదన్నారు. 'దేశంలో మత మార్పిడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో దేశంలో ఎక్కడా లేనంతగా జరుగుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరంలోని నందరం గనిరాజు జంక్షన్‌లో అతి త్వరలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తి ప్రదర్శనలు, గీతాలాపనలు అలరించాయి. బీజేపీ నేతలు బొమ్ముల దత్తు, కురగంటి సతీశ్, శ్రీ రామ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వైష్ణవ దినేశ్, డాక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు



సభకు హాజరైన హిందువులు

పరిహారం ఇవ్వకుంటే పోరాటమే

యానాం, జనవరి 28: యానాం నియోజకవర్గంలో మత్స్యకారులకు రావలసిన పరిహారంపై యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం దూకుడు పెంచింది. పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చిన మత్స్యకారుల జాబితా ఆధారంగా ప్రభుత్వ ఖాతాలో నగదు జమ చేయకుంటే ఫిబ్రవరి రెండో తేదీన పరిశ్రమ వద్ద ఆందోళనకు సిద్ధమని సంఘం హెచ్చరించింది. మత్స్యకార నాయకుడు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం మత్స్యకారుల సమావేశం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా నష్టపరిహారం విషయంలో చేసిన విశేష కృషి ఫలితంగానే ఈ స్థితికి చేరుకున్నామని, ఇప్పుడు పరిశ్రమ నుంచి అడ్డంకులు వస్తున్నాయని వాటిని ఏవిధంగా అధిగమించాలనే అంశాలపై చర్చించారు. ఆంధ్రాలో ఇప్పటికే నాలుగు విడతలు పరిహారం ఇచ్చినప్పటికీ యానాంలో మాత్రం ఒక్క విడతే ఇస్తామని, దీనిపై అటు పరిశ్రమ, ఇటు ప్రభుత్వం కాలయాపన చేస్తోందని పలువురు మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానంగా రెండు అంశాలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈనెలాఖరునాటికి ఓఎన్‌జీసీ సంస్థ ప్రభుత్వ ఖాతాలో పరిహారం జమ చేయకుంటే ఫిబ్రవరి రెండో తేదీన యానాం-గిరియంపేట రోడ్డులోని ఓఎన్జీసీ పరిశ్రమ ఎదురుగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆందోళనకు సిద్ధమన్నారు. తదపరి గ్రామాల వారీగా ఆందోళనకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని నిర్ణయించారు. అదే విధంగా చమురు సంస్థ ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తే ఫిబ్రవరి 15 నాటికి (పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ లోపు) లబ్ధిదారుల ఖాతాలో జమ చేయకుంటే మత్స్యకారులందరూ ఎన్నికలను బహిష్కరించనున్నామని తెలిపారు. ఏ పార్టీ అయినా తాము ఓటు వేయకుండా తమ నిరసనను తెలుపుతామన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలపై యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాతపూర్వకంగా ఓఎన్జీసీ, పుదుచ్చేరి ప్రభుత్వ అధికారులకు ఇతర ప్రతినిధులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, మల్లాడి శామ్యూల్, చింతా వెంకటేశ్వర్లు, మల్లాడి విష్ణు, మల్లాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు ఆక్సిజన్ ఫ్యాక్టరీలు



నర్సరీని పరిశీలిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

కడియం, జనవరి 28: కడియం నర్సరీలు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే ఫ్యాక్టరీలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రశంసించారు. కడియపులంక పుల్లా వీరవెంకట రావు-సత్యదేవా నర్సరీని ఆదివారం ఆయన సందర్శించారు. వారికి నర్సరీ రైతు వీరవెంకటరావు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. నాగేశ్వరరెడ్డి నర్సరీల్లోని వివిధ రకాల మొక్కలను తిలకించారు. కడియం నర్సరీలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య బృందంతో మరోసారి వచ్చి కడియం నర్సరీలను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పుల్లా సత్యనారాయణ (చంటియ్య), పుల్లా ఆంజనేయులు (అబ్బులు), పుల్లా రామారావు, పెద సత్యనారాయణ, వీర్రాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కస్తూరి సుబ్రహ్మణ్యం, పుల్లా శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా!



గంజాయి అంబులెన్స్ ఇదే..

మోతుగూడెం, జనవరి 28: గంజాయి అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్తగా అంబులెన్స్ మాదిరి వాహనాలను వినియోగిస్తున్నారు. అంబులెన్స్ అనుకుని పోలీసులు ఆపకుండా వదిలేస్తారని వారి తెలివితేటలు. అయితే పోలీసులు అలాంటి వారి ఆట సైతం కట్టిస్తున్నారు. మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం అంబులెన్స్ మాదిరి గంజాయి రవాణా వాహనాన్ని పట్టుకున్నారు. 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్‌మీనా వివరాలు తెలిపారు. గంజాయిని మోతుగూడెం నుంచి రాజస్థాన్‌లోని జ్యోతిపూర్‌కు తరలిస్తున్నారన్నారు. ఒడిసాకు చెందిన రామారావును అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజస్థాన్, ఒడిసాకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి విలువ రూ.25 లక్షలు ఉంటుంన్నారు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, ఏఎస్ఐలు టి.రాజేశ్వరరావు, సూర్యనారాయణ, నూకరాజు, హెడ్ కానిస్టేబుల్ యుఆర్‌కే రాజు రమేష్, మురళి, శ్రీనివాస్, పోలీసులు సన్ని, బషీర్ ఉన్నారు.

24 గంటల్లో దొంగ ఆట కట్టించారు




సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు 24 గంటల్లో దొంగ ఆట కట్టించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వెల్లిబోయిన వినయ్ దైవ దర్శనానికి 26న పిఠాపురం వచ్చాడు. అక్కడ ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరూ సాయంత్రానికి రాజమహేంద్రవరం వచ్చి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెట్రో లాడ్జిలో దిగారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి కెమెరా, ల్యాప్‌టాప్, ఆ వ్యక్తి కనిపించలేదు. దీంతో వినయ్ బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఎండీ ఉమర్ ఆధ్వర్యంలో ఎస్ఐ జగన్ మోహన్ తన సిబ్బందితో రంగంలోకి దిగారు. సీసీ కెమెరాలు ఆధారంగా కాకినాడకు చెందిన పిల్లారిశెట్టి శ్రీనివాస్‌ని నిందితుడిగా గుర్తించి ఆదివారం అరెస్టు చేశారు. సుమారు రూ.1.20లక్షల విలువ చేసే చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు పరిష్కారంలో ప్రతిభ చూపిన సీఐ ఉమర్, ఎస్ఐ జగన్, ఏఎస్ఐ ఏకే సత్యనారాయణ, పీసీ సురేశ్‌ని ఎస్పీ జగదీశ్ అభినందించారు.

కిరాణా, ఎలక్ట్రికల్ షాపులో అగ్నిప్రమాదం

రూ. 10 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన కిరాణా సరుకులు

అంబాజీపేట, జనవరి 28: అంబాజీపేట బస్టాండ్‌కు వెళ్లేదారి బీఎస్ ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఓ కిరాణా, ఎలక్ట్రికల్ షాపులో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో రూ. 10 లక్షలు విలువైన కిరాణా సరుకులు, ఎలక్ట్రికల్ సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. అంబాజీపేటకు చెందిన సత్తి త్రిమూర్తులు ఇటీవల గణపతి ఎలక్ట్రికల్ అండ్ కిరాణా స్టోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి షాపులో వెనుక భాగంలో ఉన్న ఇన్వేటర్ ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి అక్కడ ఉన్న నూనె ప్యాకెట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో ఈ మంటలు షాపంతా వ్యాపించగా షాపులో నూనె, కిరాణా సామగ్రి, ఎలక్ట్రికల్ సామన్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.10లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. సంఘటన స్థలాన్ని అమలాపురం అగ్నిమాపక అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు, అమలాపురం చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, సుంకర బాలాజీ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట కిరాణా సంఘం అధ్యక్షుడు కాసు రాజా పండు తదితరులు పరిశీలించారు.

పంపా నది ఒడ్డున మృతదేహం

తుని రూరల్, జనవరి 28: కాకినాడ జిల్లా అన్నవరంలో పంపానది ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. సుమారు 25 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. సంబంధీకులు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి

ఏపీ ఆర్యవైశ్య మహాసభలో వక్తలు పిలుపు



మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: ఆర్యవైశ్యులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకా నాథ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారాలన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారిన దృష్ట్యా రాజ్యాధికారం సాధించాలన్నారు. ఆర్యవైశ్య మహాసభకు రాజకీయ రంగు పులమలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రాయలసీమ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాల ఎన్నికలు ప్రక్రియను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నాజీ మాట్లాడుతూ పెద్దలు కొణిజేటి రోశయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ ఒక్కతాటిపై నడిచిందన్నారు. కానీ ఇప్పుడు రెండు వర్గాలుగా విడిపోవడం సరికాదన్నారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ఉండాలన్నారు. గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చిలో జనరల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ద్వారకానాథ్ నెల ముందే మహాసభ ఎన్నికలు జరుపుతున్నారని చెప్పారు. శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ రాజకీయ లక్ష్యం కోసం పెట్టిందికాదన్నారు. కుసుమంచి సుబ్బరాయులును మహాసభ నూతన అధ్యక్షుడిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నట్లు చెప్పారు. మహాసభలో విశాఖ అర్బన్ అధ్యక్షుడు అమర్, రూరల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాకినాడ అర్బన్ అధ్యక్షుడు బాదం మధు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు రంగప్రసాద్, ఏలూరు అర్బన్ అధ్యక్షుడు చక్కా రాజా, బ్రాహ్మయ్య, గుంటూరు అర్బన్ అధ్యక్షుడు ఆత్మకూరి నగేష్, నెల్లూరు అర్బన్ అధ్యక్షురాలు జ్యోతి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఆండాల్, సీతాలక్ష్మి, నేతలు హరనాథ్, శరత్ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

శరవేగంగా పవర్ కెనాల్ లీకేజీ పనులు



పనులు నిర్వహిస్తున్న కార్మికులు

మోతుగూడెం,జనవరి 28: సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ లీకేజీ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ డొంకరాయి నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని విడుదల చేసే పవర్ కెనాల్ రీచ్ వన్‌లో 2/4 వద్ద కెనాల్ వద్ద చిన్నచిన్న లీకేజీలు వస్తున్నట్లు తమ సిబ్బంది గుర్తించడంతో ఆదివారం ఎల్‌సీ అనుమతులు తీసుకుని కెనాల్ నుంచి నీటిని విడుదలను నిలుపుదల చేస్తామన్నారు. దీని వల్ల 25 మెగా వాట్ల సామర్థ్యం గల డొంకరాయి, 460 మెగావాట్ల సామర్థ్యం గల పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని కూడా నిలిపి వేసి కెనాల్ లీకేజీ అవుతున్న ప్రదేశంలో గ్రౌటింగ్ పనులను శరవేగంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం రాత్రికి గ్రౌటింగ్ పనులను పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ గ్రౌటింగ్ పనులు జెన్‌కో ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, సోమవారం నాటికి కెనాల్‌ను వినియోగంలోకి తీసుకురానున్నామని సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

చేతికందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రాజవొమ్మంగి జనవరి 28: మండలంలోని దూసరపాము గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల నిత్యం గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతి వారం గుడిలో జరిగే అన్నసంతర్పణ సమయంలో, లేదా పక్కనే ఉన్న బావి నుంచి నీరు తెచ్చుకునే సమయంలో గ్రామస్థులకు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేయలంటూ గతంలో గ్రామస్థులు అనేక సార్లు నిరసన చేయగా విద్యుత్ అధికారులు వచ్చి ఎస్టిమేట్ వేసి పంచాయతీ అధికారులకు ఇచ్చారు. అయితే ఎస్టిమేట్ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత ఎస్టిమేట్ కాపీలను పంచాయతీ అధికారులు బుట్టదాఖలు చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు లక్షల్లో ఖర్చు అవుతుంది. అయితే ప్రజల సౌకర్యార్థం కావడంతో నామమాత్రంగా కేవలం ఆరువేల రూపాయలను చెల్లించమని పంచాయతీ అధికారులకు విద్యుత్ శాఖ అధికారులు తెలియజేసినా సంబంధిత పంచాయతీ కార్యదర్శి మాత్రం సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదని గ్రామస్థులు అంటున్నారు. దీనిపై దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రాణాపాయం జరిగితే కానీ పంచాయతీ అధికారులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వై.రామవరం, జనవరి 28: రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి మండలంలోని పుల్లంగి వై.రామవరం మండలం దారగడ్డ పంచాయతీ, పూలోవ గ్రామాలలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మారేడుమిల్లి సీడీపీవో ప్రసన్న విశ్వనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. పుల్లంగిలో అంగన్‌వాడీ సహాయకురాలు, పూలోవలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు వచ్చేనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు మారేడుమిల్లి కార్యాలయానికి దరఖాస్తులు అందించాలన్నారు. అభ్యర్థులు స్థానికంగా నివాసం ఉండాలని ఎస్టీ స్త్రీ అభ్యర్థి అయి ఉండాలని పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. పదో తరగతి చదివిన వారు లేకపోతే పదో తరగతి కన్నా ముందు ఎక్కువ తరగతి పాస్ అయిన అభ్యర్థి దరఖాస్తు పరిశీలిస్తామన్నారు. 1-7-2023 నాటికి 21-35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. కుల ధ్రువీకరణ, నివాస, విద్యార్హతకు సంబంధించి సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ జెరాక్స్ కాపీలతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన రెండు సెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు కార్యాలయానికి అందజేయాలన్నారు. పూర్తి సమాచారం కోసం మారేడుమిల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆహ్లాదకరంగా విహారయాత్ర

పాపికొండలు, పేరంటాలపల్లికి పోటెత్తిన పర్యాటకులు



పర్యాటకులతో సందడిగా ఉన్న ఫెర్రీ పాయింట్



పేరంటాలపల్లిలో బొమ్మలు కొనుగోలు చేస్తున్న పర్యాటకులు

వరరామచంద్రాపురం, జనవరి 28: ప్రకృతి అందాల నడుమ పాపికొండలు, పేరంటాలపల్లి విహారయాత్ర ఆహ్లాదకరంగా సాగింది, వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో పేరంటాలపల్లి, పాపికొండల పర్యాటక కేంద్రాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.. కొండరెడ్ల గిరిజనులకు ఉపాధి దొరకడంతో ఆ ప్రాంత కొండరెడ్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఈ ప్రాంతంలో ఉపాధి కోల్పోయిన కొండరెడ్లు పర్యాటకం ప్రారంభంతో సంతోషంగా ఉన్నారు. ఆదివారం కావడంతో దాదాపుగా 1100 మంది పర్యాటకులతో గోదావరి పరివాహక ప్రాంతమంతా కళకళలాడింది. పేరంటాలపల్లిలోని అతి పురాతనమైన శివాలయాన్ని పర్యాటకులు ముందుగా దర్శించుకొని, అక్కడ కొండరెడ్లు తయారు చేసిన అందమైన వెదురు అల్లికలను కొనుగోలు చేశారు. అక్కడి నుంచి పాపికొండల అందాలను వీక్షించి తిరుగు ప్రయాణమయ్యారు.

పాపికొండలకు పర్యాటకుల తాకిడి



దేవీపట్నం, జనవరి 28: పాపికొండల అందాలను తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 7 బోట్లలో 550 మంది పర్యాటకులు వెళ్లారు. పోచమ్మ గండి వద్ద ఉన్న బోట్ పాయింట్ నందు గోదావరి పరివాహక ప్రాంతాల మీదుగా వెళ్లిన పర్యాటకులు పేరంటాలపల్లిలో సందడి చేశారు.

31న ఆర్టీసీ కార్గో అన్‌ఐడెంటిఫైడ్ పార్శిల్స్ వేలం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28: రాజమహేంద్రవరం ఆర్టీసీ కార్గో పార్శిల్ కార్యాలయంలో ఉన్న అన్ క్లెయిమ్డ్ / అన్‌ఐడెంటిఫైడ్ (ఎవరూ తీసుకెళ్లని) పార్శిల్స్‌ను ఈనెల 31వ తేదీ బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లోని పార్శిల్ బుక్కింగ్ కార్యాలయం వద్ద వేలం జరుగుతుందని, ఆసక్తిగల పాటదారులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.



సభకు వచ్చిన వారు కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు



సభా వేదిక వద్దకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



సభా ప్రాంగణంలో కదుతున్న టీడీపీ జెండాలు



సభా ఏర్పాట్లపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు



చంద్రబాబు ప్రసంగించనున్న సభావేదిక

నేడే రా..కదలి రా సభ

» టీడీపీ, జనసేన నాయకులు వనమాడి, నల్లమిల్లి, మర్రెడ్డి



పడిశలేరులో సమావేశంలో పాల్గొన్న వనమాడి, నల్లమిల్లి తదితరులు

అనపర్తి/రంగంపేట, జనవరి 28: కాతేరులో జరిగే రా.. కదలిరా బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుంచి సుమారుగా 20వేల మంది హాజరుకానున్నట్టు టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం అనపర్తిలోని జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బహిరంగ సభ ప్రదేశానికి దగ్గరగా ఉన్న రంగంపేట మండలం నుంచి 10వేల మంది, మిగిలిన మూడు మండలాల నుంచి మరో 10వేల మంది సభకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. సోమవారం ఉదయం అనపర్తి శివారు కొత్తూరు పెట్రోలు బంకు సమీపం నుంచి భారీ ర్యాలీతో కాతేరు వెళ్తామన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ జనసేన కార్యక్రమాలు విడివిడి కాదని పొత్తులో భాగంగా రెండు కార్యక్రమాలు ఒక్కటేనని, సభ విజయవంతానికి ప్రతి జనసైనికుడు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, జనసేన నాయకుడు రావాడ నాగు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కాతేరులో జరిగే సభకు వెళ్లడానికి నియోజకవర్గం నుంచి వస్తున్న మండల నాయకులకు భోజన ఏర్పాట్లు చేయడానికి ఎస్టీ రాజాపురంలోని స్థల ప్రాంగణాన్ని నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రంగంపేట మండల పరిశీలకుడు కాకినాడ రామారావు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, వెంకటరామారెడ్డి, దేవాదానబాబా, సుబ్బారెడ్డి, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకటరావు, మాచిన వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

రా..కదలి రా సభను విజయవంతం చేయాలి

దివాన్‌చెరువు, జనవరి 28: కాతేరులో సోమవారం జరిగే రా-కదలిరా సభను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు ఆదివారం విజ్ఞప్తిచేశారు. కాతేరులో జరిగే ఈ బహిరంగ సభకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాతేరు సభకు తరలిరండి: బత్తుల

కోరుకొండ, జనవరి 28: కాతేరులో జరిగే రా కదిలిరా బహిరంగ సభకు రాజానగరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 10గంటలు లోపు మధురపూడి విమానాశ్రయం వద్దకు చేరుకోవాలని చెప్పారు.

ఘనంగా సత్తెమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు, జనవరి 28: బిక్కవోలులోని జువ్వలదొడ్డిలో సత్తెమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలోగువ్వల సత్తిరెడ్డి, తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, బొబ్బిలి శివప్రసాద్, చింతపల్లి వీరబాబు, బండారు వెంకన్న, వర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ బలభద్రపురం శివారు కానేడులో వున్న గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికులు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే బిక్కవోలు వచ్చిన సందర్భంగా కార్మికులు ఆయనను కలిసి యాజమాన్యం గడచిన రెండు నెలలుగా ఫ్యాక్టరీని మూసివేసి తమను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఎన్నో యేళ్లుగా పనిచేస్తున్న సుమారు 250 మంది కార్మికులను తొలగించే ప్రయత్నాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్టు కార్మిక నేతలు ఎ.నాగేశ్వరరావు, వి.రాంబాబు, కె. వెంకటరమణ తెలిపారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్

రంగంపేట, జనవరి 28: మండలంలోని పెదరాయవరం గ్రామానికి చెందిన మద్దిపాటి వీరవరప్రసాద్‌ను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు సత్యకుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎంఎస్ఆర్‌కే రాజు, గుప్త, మైలవరపు సాయిరాం హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని వరప్రసాద్ అన్నారు.

జనసేన బలోపేతానికి కృషి: మర్రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రెడ్డి శ్రీనివాసు

రంగంపేట, జనవరి 28: మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు కోరారు. ఆదివారం మండలంలోని జి.దొంతమూరులో ఏర్పాటు చేసిన జనసేన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన మండలాధ్యక్షులుగా గిరజాల సత్తిబాబు, ముంగి మురళి, యానాల కొండయ్యలను, మండలంలోని 17 గ్రామాలకు గ్రామ అధ్యక్షులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను సత్కరించారు. అనంతరం సోమవారం కాతేరులో నిర్వహించే రా..కదలిరా బహిరంగ సభకు మండలం నుంచి భారీ ఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి టౌన్ కన్వీనర్ అనిల్ రాజీనామా

గోకవరం, జనవరి 28: వైసీపీకి మండలంలో మరో ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ గోకవరం టౌన్ కన్వీనర్, జగ్గంపేట నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ చింతల అనిల్ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు తనను తీవ్ర మనస్థాపానికి గురి చేశాయన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తోట నరసింహం బాధ్యతలు చేపట్టాక పార్టీకి సంబంధించిన ఎటువంటి సమాచారం తనకు అందడం లేదన్నారు. కొందరు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు తనను మనోవేదనకు గురి చేశాయన్నారు. దీంతో తాను పార్టీలో ఇమడలేక రాజీనామా చేసినట్టు అనిల్ పేర్కొన్నారు.

10బీర్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అల్‌కట్ గార్డెన్స్ వినాయక వీధిలోని ఓ ఇంట్లో టూటౌన్ పోలీసులు సోదాలు చేశారు. అక్రమంగా విక్రయిస్తున్న 10 బీర్లు స్వాధీనం చేసుకు న్నారు. బెల్టుషాపు నడుపుతున్న పి.వెంకన్నరెడ్డిపై కేసు నమోదు చేశారు.

డాక్టర్ పద్మలతకు మోస్ట్ ఔట్ స్టాండింగ్ లేడీ అవార్డు



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: రాజమహేంద్రవరానికి చెందిన బీసీ మహిళా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలతకు మోస్ ఔట్‌స్టాడింగ్ లేడీ అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన చాంబర్ ఇంటర్నేషనల్ అలుమినీ సమావేశంలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అవార్డును అందించింది.

నయనాల కృష్ణారావుకు డాక్టరేట్



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: రాజమహేంద్రవరానికి చెందిన మూల్ నివాసి సంఘ్ జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావుకు బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. యూనివర్శిటీ డీన్ కెఎన్ సింగ్ అధ్యక్షతన బెంగళూరులో జరిగిన సమావేశంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ ప్రెసిడెంట్ కొయిరాల గౌరవ డాక్టరేట్ పట్టా ప్రధానం చేసినట్టు తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కెకె సంజీవరావు తదితరులు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: రాజమహేంద్రవరం 2వ డివిజన్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు.బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి భవానీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. బాధితులను అన్నివిధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి కంటితుడుపు చర్యగా కొద్ది సొమ్ము ఇచ్చి వెళ్లడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శెట్టి బలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, నగర టీడీపీ ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకీ రామయ్య, సలాది ఆనంద్, పితాని కుటుంబరావు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

42 ఏళ్ల తర్వాత కలిశారు..



సీతానగరం, జనవరి 28: వారంతా 42 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. అనంతరం ఉన్నత చదువులు, వృత్తి రీత్యా ఎక్కడెక్కడికో వెళ్లిపోయారు. తిరిగి ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. సీతానగరం ప్రభుత్వోన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం అదే పాఠశాలలో జరిగింది. వృత్తి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోటకు చేరుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి అల్లరి చేష్టలను, మధుర స్మృతులను గుర్తుచేసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా గురువులు ఎస్ఎం రామారావు, వీరభద్రరావు మాస్టారు, రాంప్రసాద్, గీతా సుహాసిని లను సత్కరించారు. కార్యక్రమంలో చేకూరి సత్తిపండురాజు, గద్దే వెంకటకృష్ణచౌదరి, గిరజాల శ్రీనివాసరావు, దేవానంద్‌లతో పాటు సుమారు 80 మంది వారి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 14 మంది ఎంపిక

కోరుకొండ, జనవరి 28: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలానికి చెందిన 14 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరిలో కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ నుంచి ముగ్గురు, శ్రీరంగపట్నం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు, బొల్లెద్దుపాలెం, గాదరాడ, మధురపూడి జిల్లా పరిషత్ హైస్కూళ్ల నుంచి ఒక్కొక్క విద్యార్థి చొప్పున ఎంపికైనట్టు పరీక్ష నిర్వాహకులు ప్రకటించారు.

30న మహాచండీ హోమం

కోరుకొండ, జనవరి 28: ఈ నెల 30న మంగళవారం ఉదయం 9గంటలకు గాదరాడ గ్రామంలో గణపతి రుద్ర సహిత మహాచండీ యాగం నిర్వహించనున్నట్టు జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ తెలిపారు. జనసేన, టీడీపీ నాయకులు, వీరమహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పలువురికి నెహ్రూ పరామర్శ

గోకవరం, జనవరి 28: మండలంలోని పలు కుటుంబాలను జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం పరామర్శించారు. గోకవరానికి చెందిన సామాంతుల పాపారావు కుమారుడు ఇటీవల ప్రమాదానికి గురవ్వడంతో ఆయనను, అలాగే పీత అప్పలకొండ అనే మహిళా కార్యకర్త కాలు విరిగిపోవడంతో ఆమెను పరామర్శించారు. గాదెలపాలెం మాజీ ఎంపీటీసీ గుత్తుర్తి లక్ష్మి కాలుకు గాయమవ్వడంతో ఆమెను, మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ కొలుసు కనకరాజును నెహ్రూ పరామర్శించారు. కార్యక్రమంలో మంగరౌతు రాము, దాసరి తమ్మన్నదొర, బదిరెడ్డి అచ్చన్నదొర, గళ్ళా రాము, పెద్దాడ వెంకన్నదొర, మండిగ గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవస్థలో వలంటీర్లు కీలకం

గోకవరం, జనవరి 28: ప్రభుత్వ వ్యవస్థలో వలంటీర్ల పాత్ర కీలకమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. గోకవరంలో ఆదివారం వలంటీర్లు, డ్వాక్రా యానిమేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నేరుగా, పారదర్శకంగా లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. అలాగే రానున్న రెండు మూడు నెలల్లో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అందేవిధంగా కృషి చేయాలన్నారు. ఏలూరులో ఫిబ్రవరి 1న నిర్వహించనున్న సిద్ధం కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని నరసింహం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నిడదవోలు, జనవరి 28: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదిం చిన డిస్కమ్స్ వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 29న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని నిడదవోలు డివిజినల్ ఇంజనీర్ తెలిపారు. నిడదవోలులోని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10.30 నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 వరకు జరిగే ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తామన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	సైంధవ్
సూర్యామినీ	నా సామి రంగ
సూర్యాప్యాలస్	గుంటూరు కారం
స్వామి	గుంటూరు కారం
శివజ్యోతి	నా సామి రంగ
అనుశ్రీ(సాయికృష్ణ)	హనుమాన్
రాజా	హనుమాన్
అశోక	సలార్
ఊర్వశి	హనుమాన్
రంభ	నా సామి రంగ
మేనక	హనుమాన్
అప్సర	గుంటూరు కారం
కుమారి	హనుమాన్
వీఎస్ మహల్(నామవరం)	హనుమాన్, నాసామిరంగ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	నా సామి రంగ
వెంకటసూర్య(కడియం)	హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	గుంటూరు కారం
సూర్యశ్రీ (అనపర్తి)	గుంటూరు కారం
ఫార్ట్యూన్ సినిమాస్(రాజానగరం)	గుంటూరు కారం
రామకృష్ణ(కోరుకొండ)	సైంధవ్
గీతాసినిమాస్ (సీతానగరం)	సైంధవ్
శ్రీనివాస (గోకవరం)	సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	గుంటూరు కారం
లలితామహల్(రంపచోడవరం)	హనుమాన్, నాసామిరంగ
నవయుగ(చింతూరు)	హనుమాన్



చంద్రబాబుకు భారీ స్వాగత ఏర్పాట్లు

అక్రమ కేసుల్లో 53 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధానికి గురై విడుదలై వెళ్లిన తర్వాత బహిరంగ సభలో పాల్గొనేందుకు తొలిసారిగా జిల్లాకు వస్తున్న నారా చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలకడానికి నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చంద్రబాబు చేరుకుంటారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడ నుంచి కారులో సభకు చేరుకుంటారు.

నేడే.. రా కదలిరా!

- కాతేరులో బహిరంగ సభ
- ఉదయం 11 గంటలకు ఆరంభం
- 2 లక్షల మంది వస్తారని అంచనా
- 23 ఎకరాల్లో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఇక కొద్ది రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల శంఖారావం పూరించడానికి తూర్పుగోదావరి సిద్ధమైంది. వచ్చే ఎన్నికలకు కేడర్, ప్రజలను సిద్ధం చేయడానికి, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన అధికార వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సోమవారం తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలోనూ జిల్లా స్థాయి బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. లక్షలాది మందికి స్వాగతం పలకడానికి కాతేరు గ్రామం ముస్తాబైంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సభ జరగనుంది.గోదావరి ఫోర్త్ బ్రిడ్జి సమీపంలోని కాతేరులోని తిరుమల విద్యాసంస్థల సమీపంలోని 23 ఎకరాల విశాలమైన మల్లు లేఅవుట్‌లో బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. పెద్ద వేదికతో పాటు సభకు హాజరయ్యేవారికి ఇబ్బందిలేకుండా భారి కేడ్లతో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వేదిక మీద సుమారు 100 మంది కూర్చునేటట్టు సిద్ధం చేశారు.వేదిక ముందు 10 వేల మంది వీఐపీలు కూర్చునేలా కుర్చీలు వేసి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు.మరో పక్క మీడియాకు ఏర్పాట్లు చేశారు. 2 లక్షల మంది పట్టే విధంగా విశాలమైన గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. ప్రాంగణం ఫెక్సీలు, పసుపు జెండాలతో ధగధగ వెలిగిపోతోంది. సమీపంలోని తిరుమల కాలేజీ ప్రక్కన హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతారని సమాచారం. ఒక్కో నియోజకవర్గం నుంచి 30 వేల మంది వచ్చేటట్టు ఆయా నేతలు బాధ్యతలు తీసుకున్నారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ఆయా నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఉదయం 10గంటలకే ప్రారంభమవుతుంది. చంద్రబాబు సుమారు 11.25 గంటలకు సభకు చేరుకుని, 1గంటకు తన ఉపన్యాసం ముగిస్తారు. సభ ఏర్పాట్లను మూడు రోజుల నుంచి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు,మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రులు కెఎస్ జవహర్, ప్రత్తిపాటిపుల్లారావు, గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ, జోన్-2 పరిశీలకుడు మందలపు రవి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం కూడా వారు ఇక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.సభకు టీడీపీ, జనసేన క్యాడర్ తరలిరానుంది. నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15 గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వస్తారు.అక్కడ నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45 గంటల నుంచి ఒంటి గంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు.అనంతరం 1.50 గంటలకు బయలుదేరి కాతేరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం వెళతారు.



తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం





ఫ్లెక్సీల ఏర్పాటు

సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలి స్తున్న మాజీ మంత్రులు యనమల, చినరాజప్ప, గోరంట్ల,జవహర్ తదితరులు

కోట సత్తెమ్మకు మహా నివేదన



నిడదవోలు, జనవరి 28 : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మను ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అమ్మవారికి ఆదివారం ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,01,884లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.

పెదనాన్నే కామ పిశాచి!

మరదలి కుమార్తెను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పెదనాన్నే కామ పిశాచిగా మారి కుమార్తెను వేధిస్తున్న ఘటన రాజమహేంద్రవరంలో చోటు చేసుకుంది. భర్తతో విభేదాల కారణంగా ఓ వివాహిత కొన్నేళ్లుగా తన ఇద్దరు కుమార్తెలతో దేవీచౌక్‌లో నివాసం ఉంటూ షాపుల్లో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. పెద్ద కుమార్తె పది, రెండో కుమార్తె తొమ్మిది చదువుతున్నారు. అయితే ఇదిలా ఉండగా వివాహిత అక్క భర్త ప్రసాద్ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళుతుంటాడు. ఇదిలా ఉండగా ఈ నెల 18వ తేదీన వివాహిత ఇంటికి వచ్చేసరికి అతడు కంగారుగా పరిగెత్తుకుని వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొంది.కుమార్తెను నిలదీయగా నాలుగు నెలల నుంచీ తనను లైంగికంగా వేధిస్తున్నాడని చెప్పిందని వాపోయింది.ఈ మేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పోక్సో కేసు నమోదు చేశారు.

మొక్కు తీరకుండానే మృత్యుఒడికి..

వ్యాన్ తొట్టి ఢీకొని యువకుడి మృతి

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గుడికి మొక్కు తీర్చుకుందామని వెళ్లిన ఆనందం ఆ కుటుంబంలో గంటల్లో ఆవిరైపోయింది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా కొత్తగాజువాకకు చెందిన గొర్ల నాయుడు(26) ఏవీ అప్పారావు రోడ్‌లో అక్కాబావ దగ్గర ఉంటున్నాడు. తన బావ అప్పల నాయుడు సూపర్‌వైజర్‌గా పనిచేసే రెస్టారెంట్లో ఉద్యోగం చేస్తున్నాడు. మొక్కు తీర్చుకోవడానికి కుటుంబీకులతో కలిసి ఆదివారం కేశవరంలోని గుడికివెళ్లాడు. ఏవో సరుకులు అవసరం కావడంతో రాజమహేంద్రవరం వచ్చి తిరిగి వెళుతుండగా రాజవోలు రోడ్డులో పక్కనే వెళ్తున్న పౌర సరఫరాల బియ్యం రవాణా చేసే వ్యాన్ తొట్టి వెనుక భాగం అతడి తలకు బలంగా తగిలింది.దీంతో నాయుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జుబేర్ తెలిపారు.



మాట్లాడుతున్న ఏపీ అంగన్వాడీ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

హామీల అమలు జీవోలు విడుదల చేయాలి

అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 : అంగన్వాడీలకు జగన్మోహన రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీల సమ్మె జనవరి 22 అర్ధరాత్రితో ముగిసిందని, అయితే ఇది పోరాటం ముగిసినట్టు కాదని తాత్కాలిక విరామమేనన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ యూనియన్ ఇచ్చిన 11 డిమాండ్లలో 9 డిమాండ్లపై నిర్దిష్టంగా ఆదేశాలు ఇస్తామని జగన్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండు వరకూ ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు వద్ద సా..గుతున్న పనులు

కళ తప్పిన పోలవరం

- నేటికీ ముందుకు సాగని పనులు
- టీడీపీ హయాంలోనే పనుల్లో వేగం
- నేడు తూతూమంత్రంగా జరుగుతున్న వైనం
- ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి సీఫేస్
- దానిని తోడడానికి 40 పైపులు
- కేవలం వైబ్రో కాంపాక్షన్ పనులతో కాలక్షేపం
- ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గాలికే
- స్పిల్‌వే మాత్రమే పూర్తి..
- ప్రధాన కాలువల సంగతేంటి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు కళ తప్పింది. ఈపాటికే పూర్తయ్యి నీటి ప్రవాహంతో కళకళలాడాల్సిన ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.ప్రస్తుతం స్పిల్‌వే పూర్తయినా.. ప్రధాన కాలువలు పూర్తి కానందున కనీసం గ్రావిటీ ద్వారా కూడా స్పిల్‌వే నుంచి ప్రధాన కాలువలకు నీరు పంపే పరిస్థితి లేదు. ప్రధాన డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) పూర్తి చేసి, కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ఈ ప్రాజెక్టుకు ఒక రూపు వస్తుంది. ఇప్పటి వరకూ కేవలం స్పిల్‌వే గేట్లు పెట్టి నీటిని వదలడానికి వీలుగా పూర్తి చేశారు.ఇవి ఇంచుమించు పనులు పూర్తయినట్టే. స్పిల్ వే అంటే ఓ బ్యారేజీ మాత్రమే. ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా రాజకీయకోణం నుంచి చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నట్టు కనిపిస్తోంది. 2019 ఎన్నికల ముందు టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు చూడడానికి వెళితే వందలాది యంత్రాల హోరుతో పనులు జరిగేవి. ప్రస్తుతం పనులు తూతూమంత్రంగా జరుగుతున్నాయి.కేవలం రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య ఇసుక ఫిల్లింగ్ ఓ మాదిరిగా చేస్తూ దానిని రెండు యంత్రాలతో వైబ్రోకాంపాక్షన్ చేస్తున్నారు. అంటే ఇసుకను అక్కడ గట్టిగా కూరి గట్టి పరుస్తున్నారు. మరో పక్క ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి లీకవుతున్న నీటిని తోడుతున్నారు.ఇంకో పక్క పవర్ ప్రాజెక్టు టన్నెల్స్ ఇనుప ఊచలతో లైనింగ్ పనులు నెమ్మదిగా చేస్తు న్నారు.ఇంత కంటే ఇక్కడ జరిగే పనులేవీ కనిపించడంలేదు.

ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి వాటర్ సీఫేస్

ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి గోదావరికి అడ్డుగా ఎగువ,దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ రెండు డ్యామ్‌ల మధ్యనే ఈసీఆర్ఎఫ్ నిర్మిస్తారు. ప్రస్తుతం ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన గోదావరి నీరు కొంత నిల్వ ఉంది. అదే స్పిల్‌వే గేట్ల గుండా రాజమహేంద్రవరం వైపు అంటే ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వైపు వస్తుంది.ఇంత వరకూ ఇబ్బందిలేదు .కానీ పర్యవేక్షణ సరిగా లేకపోవడం వల్ల కాఫర్ డ్యామ్ నుంచి వాటర్ లీకేజీ అవుతుంది. ఇది కేవలం సీఫేస్ మాత్రమేనని దీని వల్ల ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు.ఈ నీరు ఉన్న చోట ఓ మాదిరిగా కాలువ చేసి డయా ఫ్రమ్‌వాల్ నిర్మించిన ప్రాంతం నుంచి దిగువ కాఫర్ డ్యామ్ వద్దకు మళ్లించి అక్కడ నుంచి పంపుల ద్వారా దిగువ కాఫర్ డ్యామ్ దిగువకు తోడేస్తున్నారు. సుమారు 40 పంపులు ఇక్కడ అమర్చారు.

వైబ్రో కాంపాక్షన్ పనులతో కాలక్షేపం

ఎగువ ,దిగువ కాఫర్ డ్యామ్ వల్ల ప్రధాన ప్రాజెక్టు నిర్మించే ప్రాంతంలో డయాఫ్రంవాల్‌కు అటూఇటూ ఖాళీ స్థలాల్లో ఇసుక డంపింగ్ చేస్తున్నారు. దానిని రెండు భారీ యంత్రాలతో ఇసుకను నొక్కి గట్టి పరుస్తున్నారు.దీనిని వైబ్రో కాంపాక్షన్ అంటారు. ఇసుక డంపింగ్ కూడా భారీగా లేదు.సుమారు 20 నుంచి 30 లారీల ద్వారా గోదావరి ఇసుకను మరో చోట నుంచి ఇక్కడకు తరలిస్తున్నారు. ఇక్కడే యంత్రాలు కనిపిస్తున్నాయి.ఈ పనులతోనే ఏదో పోలవరం పూర్తిచేస్తున్నట్టు కాలక్షేపం చేస్తున్నారు.

యంత్రాలకు పని లేదు

మెయిన్ డ్యామ్ పనులు మొదలు కాకపోవడంతో యంత్రాలకు పనిలేకుండా పోయింది. కొన్ని లారీలతో ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో కొన్ని యంత్రాలు, వాహనాలు కొండ మీద పార్కింగ్ ప్రాంతాలలోనే కనిపి స్తున్నాయి.కొన్ని యంత్రాలకు ముసుగులేసేశారు. పోల వరం ప్రాజెక్టు ఎత్తు 53 మీటర్ల నిర్మించాలి. ప్రస్తుతం 41.5 మీటర్ల ఎత్తువరకూనిర్మించనున్నట్టు చెబుతు న్నారు.. ఇది మొదటి దశ అంటున్నారు. ఇది కూడా ప్రస్తుతం వినియోగంలో వచ్చినట్టు లేదు.

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్ ఏదీ..

ప్రధాన డ్యామ్ అయిన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పూర్తయితేనే పోలవరం ప్రాజెక్టు రిజర్వాయరు నిర్మించినట్టవుతుంది. కానీ దీని నిర్మాణానికి గోదావరి నదిలో నిర్మించిన డయాఫ్రం వాల్ అధిక వరదల వల్ల కొద్ది మేర దెబ్బతిన్నట్టు అధికారులు ధ్రువీకరించారు.దీనికి మరమ్మతులు చేయాలా..ప్రత్యామ్నాయంగా మరొకటి నిర్మించాలా అనేది నిర్ణయించాల్సి ఉంది. కానీ ఉన్నతాధికారులు కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తేనే మంచిదని లేఖ రాసినట్టు సమాచారం.ఇది అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. డయా ఫ్రంవాల్ విషయం తేలిన తర్వాత, ఈసీ ఆర్ఎఫ్ వాల్ డిజైన్ చేసి అసలు ప్రాజెక్టు నిర్మిస్తారు.

పోలవరం ప్రాజెక్టు ప్రాంతం



ఎక్కడి పనులు అక్కడే..

ప్రస్తుతం గోదావరికి అడ్డంగా ఎగువ కాఫర్ డ్యామ్ సుమారు 42.5 మీటర్ల ఎత్తున నిర్మించారు. దీంతో వరద సమయంలో ఫారెస్ట్‌లోని గ్రామాలు, పాపికొండల ప్రాంతం బాగా మునిగిపోతుంది. అప్పుడు స్పిల్‌వే కూడా కిందకు వదిలేసి ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు ఎత్తితే అది సముద్రంలోకి పోతుంది.ప్రస్తుతం వరదలు లేక ఎగువ కాఫర్ డ్యామ్ పైన ఓ మోస్తరు మాత్రమే నీరుంది.గత ప్రభుత్వంలో మొదట ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన వెంటనే స్పిల్‌వే గుండా గ్రావిటి అంటే వరద రూపేణా వచ్చిన నీటిని ముందు కాలువలకు మళ్లించాలనే ఉద్దేశంతో కాలువల పనులు చేపట్టారు.పోలవరం ప్రాజెక్టు సమీపంలో కొద్దిగా మినహాయించి మిగతా కుడి ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కాలువలోకి నీరు మళ్లించి కృష్ణానదికి అనుసంధానం చేసిన సంగతి తెలిసిందే. అదే సమయంలో ఎడమ ప్రధాన కాలువ పనులు వేగవంతంచేసి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మించి దాని ద్వారా ఏలేరు రిజర్వాయరుకు కొంత నీటిని మళ్లించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ ప్రధాన కాలువల పనులు ఆగిపోయాయి.కుడి ప్రధాన కాలువ పని చాలా వరకూ పూర్తయినప్పటికీ.. ఎడమ ప్రధాన కాలువ పనులు ఆగిపోయాయి. కాలువ పనులు పూర్తయితే కనీసం స్పిల్‌వే గుండా గ్రావిటీ ద్వారా నైనా వరదల సమయంలో నీటిని మళ్లించవచ్చు. కుడి ప్రధాన కాలువ ద్వారా కృష్ణా, ఎమడ ప్రధాన కాలువ ద్వారా విశాఖకు నీటిని మళ్లించవచ్చు. ఈ కాలువ పనులను వదిలేశారు.ఇవి వదిలేసి ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు డిజైన్ రాలేదని,డయా ఫ్రంవాల్ మరమ్మతు చేయాలా..ప్రత్యామ్నాయం నిర్మించాలా అనేది తేలలేదని, అవి రెండూ నిర్ణయాలు జరిగిన తర్వాతే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనులు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో 2021కే పూర్తి కావలసిన ప్రాజెక్టు 2025 జూన్‌కు మారింది.మరో పక్క పెరిగిన నిర్మాణ అంచనాలపై కేంద్రం నుంచి స్పష్టత లేదు. గత ప్రభుత్వంలో ఆమోదం తెలిపిన కేంద్రం, ప్రస్తుతం రకరకాల కారణాలు చెబుతోంది. మరో ప్రక్క ప్రస్తుతం పనులు చేసిన కాంట్రాక్టు సంస్థకు సుమారు రూ.1000 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. మరో ప్రక్క పునరావాసం సంగతి గాలిలోనే ఉంది. ఇంకా అనేక కాలనీలు నిర్మించాల్సి ఉంది. గ్రామాలను తరలించాల్సి ఉంది.కొన్ని మండలాల ప్రజలను తరలించారు.కానీ వారికి కాలనీలు పూర్తిగా నిర్మించి ఇవ్వలేదు.



మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు

ఆర్యవైశ్యులు రాజ్యాధికారం సాధించాలి!

ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభలో నాయకుల తీర్మానం 6లో..

నెల రోజుల్లో జైళ్లలో ఉన్న బాలల గుర్తింపు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జైళ్లలో బాలబాలికలు ఉంటే గుర్తించి వారికి తగు న్యాయ సహాయం చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి తెలి పారు. యువత పునరుద్ధరణ పేరుతో నల్సా ప్రారంభించిన దేశవ్యాప్త కార్యక్ర మంలో భాగంగా కేంద్ర, మహిళా కారాగాలను ఆదివారం సందర్శించి మాట్లా డారు. చట్టంతో విభేదించిన పిల్లలు వారి వయసును న్యాయస్థానాల్లో నిరూపిం చుకోవడానికి అవసరమైన చట్టపరమైన సహాయాన్ని అందించే లక్ష్యంతో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 27వ తేదీ వరకూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామన్నారు. అర్హులైన వాళ్లు న్యాయ సహాయం కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లేదా కారాగారంలోని పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అభ్యర్థనను డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని కోరారు.



సభకు హాజరైన టీచర్లు, ఉద్యోగులు

ఓపీఎస్ సాధిద్దాం!

ఓపీఎస్ మన హక్కు.. పోరాడదాం.. సాధించుకుందాం.. సీపీఎస్.. జీపీఎస్ మనకెందుకు.. జీపీఎస్ ఇచ్చే పార్టీలకే ఓటేద్దాం అంటూ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రతినబూనారు. ఓపీఎస్ రాష్ట్ర వ్యాప్త సాధన సభ ఆదివారం ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో రాజమహేంద్రవరంలో నిర్వహించారు.ఈ సభకు సుమారు 5 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు.. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యమ కార్యాచరణకు దిగుతామని హెచ్చరిక చేశారు. - వివరాలు 6లో

రాముడు గెలిచాడు..



సభకు హాజరైన భక్తజనం

జై శ్రీరామ్.. .జై శ్రీరామ్ నినాదాలతో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం మార్మోగింది. హిందూ సంగమ సభ ఆదివారం ఘనంగా జరిగింది.. 500 ఏళ్ల తరువాత రాముడు గెలిచాడని కాకినాడ శ్రీ పీఠం స్వామీజి పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. మాత మార్పిడులను అరికట్టాలన్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున హిందువులు తరలివచ్చారు. ప్రాంగణం అంతా జై శ్రీరామ్ నినాదాలతో ఉన్న కాషాయం జెండాలతో నిండిపోయింది.. - వివరాలు 6లో

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యమివ్వాలి

డాక్టర్ సనత్‌కుమారి.. నిడదవోలు పీహెచ్‌సీ పరిశీలన



నిడదవోలు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ సనత్‌కుమారి

నిడదవోలు, జనవరి 28: ప్రభుత్వాసుపత్రుల్లో సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యమిస్తూ గర్భిణులకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రభుత్వాసుపత్రుల సర్వీసెస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.సనత్‌కుమారి అన్నారు. ఆదివారం నిడదవోలులోని పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జనవరి నెలలో 47 డెలివరీలు కాగా అందులో అత్యధిక శాతం సిజేరియన్ ఆపరేషన్లు చేసినట్టు గుర్తించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక కేసులో నార్మల్ డెలివరీకి సాధ్యమయ్యే అవకాశం ఉన్నా సిజేరియన్ చేసినట్టు గుర్తించామని, ఇటువంటి కేసుల విషయంలో కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ పలు విభాగాలను పరిశీలించారు. ఆమె వెంట పలువురు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

సర్వేల ఆధారంగానే అభ్యర్థుల మార్పులు

హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, జనవరి 28: సీఎం జగన్ సర్వేల ఆధారంగానే అభ్యర్థుల మార్పులు చేశారని, దానిలో భాగంగా తనను గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే తలారి కష్టాన్ని లాగేసుకుని ఈ నియోజవర్గాన్ని తాను దక్కించుకున్నానని కార్యకర్తలు అపోహ పడవద్దన్నారు. అనంతరం మంత్రిని, నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నమని వెంకటేశ్వరరావును పార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీటీసీ స్వర్ణలత, కూచిపూడి సతీష్, గడా జగదీష్, రాజేంద్రబాబు, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండుగ

కొవ్వూరు, జనవరి 28: రజకులు బల్లల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని రజక సంఘ కమిటీల ఆధ్వర్యంలో రజకులు ఆదివారం డప్పు వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గోదావరి తీరంలోని గోదావరి మాతకు, బల్లలకు పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. గౌతమీ రజక జన సేవా సంఘం ప్రెసిడెంట్ కోటిచుక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఊరేగింపుగా గోష్పాదక్షేత్రానికి చేరుకుని గంగమ్మ తల్లికి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేల్పూరి శ్రీనివాసరావు, పొన్నాడ శ్రీనివాస్, కోటిచుక్కల నాగేశ్వరరావు పాల్గొనగా గౌతమి రజక సేవా సంఘం అధ్యక్షుడు ప్రత్తిపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పేకేటి భాస్కరరావు, మక్కామల శ్రీను, చాగంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే గంగాదేవి రజక సేవా సంఘం అధ్యక్షుడు కశింకోట చిన్నబ్బాయి ఆధ్వర్యంలో జరిగిన బల్లల పండుగలో మురమళ్ల సత్యనారాయణ, వడిగళ్ల అచ్చారావు, నూకరాజు, రాజు, చిట్టాబ్బాయి పాల్గొన్నారు.

30న ఏలూరులో నిరసన దీక్ష

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు

కొవ్వూరు, జనవరి 28: ఈ నెల 30న మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడతామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు అన్నారు. ఆదివారం కొవ్వూరులో ఆయన మాట్లాడుతూ 73,74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243జి 11 షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాల్లోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్‌లకు నిధులు, విధులు, అధికారాలను అందించాలన్నారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు తమవి కావని, తమపై నమ్మకంతో తమకు ఓటు వేసి గెలిపించిన మూడున్నర కోట్ల ప్రజలవని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరూ నిరసన దీక్షకు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి పరామర్శ



జగన్నాథపురంలో రమేష్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న సువర్ణరాజు

గోపాలపురం, జనవరి 28: జనసేన పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భద్రత, వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తామని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. మండలంలో జగన్నాథపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త ఎర్రోజు రమేష్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రమేష్ ఇద్దరు కుమార్తెల చదువులకు అయ్యే ఖర్చు భరించి వారి కాళ్ల మీద వారు నిలబడేలా చేస్తానని కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గణపతి, సూర్యభగవాన్, సత్యనారాయణ, జగపతిబాబు, రాము, స్వామి, నాగేశ్వరరావు, నరేష్, శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చాగల్లు, జనవరి 28: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు కొవ్వూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా మండలంలోని చంద్రవరం, మల్లవరం గ్రామాల్లో పర్యటించి నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ కృష్ణ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, గారపాటి శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

కొవ్వూరు, జనవరి 28: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరుకు చెందిన కాపకాయల హరిక రాజేశ్వరికి, భీమవరానికి చెందిన శివ సంతోష్‌తో 2021లో వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. కొంతకాలం నుంచి భర్త, అత్తమామలు, బావ అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్నట్టు పట్టణ పోలీసుస్టేషన్‌లో రాజేశ్వరి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

చాగల్లు ఎస్ఐగా నాగరాజు



చాగల్లు, జనవరి 28: చాగల్లు ఎస్ఐగా పి.నాగరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిడదవోలు నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు అధిక ప్రాధాన్యమిస్తానన్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సీహెచ్‌వీ రమేష్ భీమవరం టౌన్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.

నిడదవోలు రైల్వేట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

నిడదవోలు, జనవరి 28: నిడదవోలులోని చిన కాశీరేవు రైల్వే ట్రాక్‌పై ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉండొచ్చని, ఒంటిపై గాయాలున్నాయన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్ఐ చెప్పారు.

దూబచర్లలో ఉచిత వైద్య శిబిరం

నల్లజర్ల, జనవరి 28: దూబచర్ల ఏలైట్ విద్యా సంస్థలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 280 మందికి ఏలూరు ఆయూష్ ఆసుపత్రి వైద్య బృందం సేవలందించినట్టు విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి తెలిపారు. అలాగే కాలేజ్ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ దుర్గాప్రసాద్, విద్యా సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నిడదవోలు, జనవరి 28: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన డిస్కమ్స్ వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 29న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని నిడదవోలు డివిజనల్ ఇంజనీర్ తెలిపారు. నిడదవోలులోని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10.30 నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 వరకు జరిగే ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తామన్నారు.

‘రా.. కదలి రా’కు తరలి రండి

» మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

కొవ్వూరు, జనవరి 28: జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు రా.. కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల స్కూల్ పక్కన సోమవారం ఉదయం 10గంటలకు జరగనున్న రా కదలిరా కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఉదయం 9గంటలకు కొవ్వూరు గామన్‌బ్రిడ్జి అండర్‌పాస్ వద్ద నుంచి బస్సులు, కార్లు, బైక్‌లపై ర్యాలీగా సభకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, మండలాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, కాగిత రఘు, మాదిరెడ్డి సతీష్ పాల్గొన్నారు.



దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఐతాబత్తుల ఆనందరావు

జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధం : మద్దిపాటి



నల్లజర్ల, జనవరి 28: మరో 74 రోజుల్లో జగన్‌రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మట్లాడుతూ ఏపీని వైసీపీ సర్వ నాశనం చేసిందన్నారు. 29న కాతేరులో జరిగే రా కదలి రా కార్యక్రమానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, జమ్ముల సతీష్, నిమ్మలపూడి ప్రసాద్,కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు, పసుమర్తి రతీష్ పాల్గొన్నారు. కాగా నల్లజర్లలో నియోజక స్థాయి టీడీపీ నాయకులతో నిర్వహించిన సమీక్షలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మా ట్లాడారు. కాతేరులో జరిగే సభను విజయవతం చేయాలని, అన్ని గ్రామాల ఉంచి నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించాలన్నారు. కార్యక్రమంలో గంటా బాజ్జి, తాతాన సత్యనారాయణ, చదలవాడ ప్రసాద్, హోతా రాజు, కొయ్యల మూడి చిన్నబాబు, వల్లూరి సత్తిపండు పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు

సభను విజయవంతం చేయండి

దేవరపల్లి, జనవరి 28: కాతేరులో జరిగే రా.. కదలి రా సభకు నియోజకవర్గం నుంచి 15వేల మంది హాజరవుతున్నట్టు నియోజకవర్గ పరిశీలకుడు, అమలాపురం మాజీ ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు అన్నారు. దేవరపల్లిలో టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ సీఎం జగన్ దుర్మార్గ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లో ఉన్నాయని, వైసీపీని ఓడించడానికి ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కాతేరు సభకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనీల్, నాయకులు ధర్మపాల్, గన్నమని హరికృష్ణ, కొరారు ధ్రువకాంత్, ఉప్పులూరి రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించాలి

» ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు, హక్కు

» ఓట్ ఫర్ ఓపీఎస్ సభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటీఎఫ్ నాయకులు స్పష్టీకరణ

» ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ



సభలో ప్రసంగిస్తున్న యూటీఎఫ్ నాయకుడు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించే రాజకీయపార్టీలకే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు స్పష్టం చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రవ్యాప్త పాత పెన్షన్ సాధన సభ నిర్వహించారు. ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ నినాదాలు చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల న్యాయమైన ఆందోళనా కార్యక్రమాలను ప్రభుత్వం పోలీసుల సహకారంతో అణచివేయాలనుకోవడం సరికాదన్నారు. ఉపాధ్యాయులను హేబిట్యువల్ అఫెండర్స్ (అలవాటైన నేరస్తులు)గా పరిగణించడం దారుణమని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓపీఎస్‌ను తమ మేనిఫెస్టోలో చేర్చడంతో పాటు మొదటి సంతకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీపీఎస్ డొల్ల అని, గ్యారంటీలేని పెన్షన్‌కు గ్యారంటీ అని పేరు పెట్టడం విడ్డూరమని అన్నారు. ఉపాధ్యాయులంతా ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 నుంచి మండలస్థాయిలో, 18 నుంచి 21వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయిలో, 25 నుంచి 28వ తేదీ వరకూ జిల్లాస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలసి వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. మార్చి 15 తర్వాత చర్చా వేదికలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనకు జరిగే పోరాటానికి సీపీఎం సంపూర్ణమద్దతు ఇస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచి మద్దతు లభించకపోతే శాసనసభలకు సొంతంగా ప్రతినిధులను పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాలమైన ప్రజా సమీకరణతో ఎవరు ముఖ్యమంత్రి అవ్వాలో నిర్ణయించే శక్తిగా మారాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, అరుణకుమారి, గోపి, మూర్తి, జ్యోతి బసు, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఉపాధ్యాయులు

రాజ్యాధికారం వైపు అడుగులేయాలి

» ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్

» నూతన అధ్యక్షుడిగా కుసుమంచి సుబ్బరాయులు నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: ఆర్యవైశ్యులు రాజ్యాధికా రం వైపు అడుగులు వేయాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారాలన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారిన దృష్ట్యా మనం రాజ్యాధికారం సాధించాలన్నారు. ఆర్యవైశ్య మహాసభకు రాజకీయ రంగు పులమలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఏపీ ఆర్యవైశ్యమహాసభ అధ్యక్షుడు రాయలసీమ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాల ఎన్నికలు ప్రక్రియను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నాజీ మాట్లాడుతూ పెద్దలు కొణిజేటి రోశయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ ఒక్కతాటిపై నడిపించిందన్నారు. కానీ ఈ రోజు రెండు వర్గాలుగా వీడిపోవడం సరికాదన్నారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు గుప్తా మాట్లాడుతూ ఆర్య వైశ్యులంతా సంఘటితంగా ఉండాలన్నారు.గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చిలో జనరల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ద్వారకానాథ్ నెల ముందే మహాసభ ఎన్నికలు జరుపుతున్నారని చెప్పారు. శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ రాజకీయ లక్ష్యం కోసం పెట్టిందికాదన్నారు. కూసుమంచి సుబ్బరాయులును మహాసభ అధ్యక్షుడిగా ప్రజాస్వామ్యపద్ధతిలో ఎన్నుకున్నట్టు చెప్పారు. ఆయనతో పాటు తామంతా ముందుంటామని చెప్పారు. ఈ మహాసభలో విశాఖ అర్బన్ అధ్యక్షుడు అమర్, రూరల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాకినాడ అర్బన్ అధ్యక్షుడు బాదం మధు, పశ్చిమగోదావరి జిల్లా రంగప్రసాద్, ఏలూరు అర్బన్ అధ్యక్షుడు చక్కా రాజా, బ్రాహ్మయ్య, గుంటూరు అర్బన్ అధ్యక్షుడు ఆత్మకూరి నగేష్, నెల్లూరు అర్బన్ అధ్యక్షురాలు జ్యోతి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అండాల్, సీతాలక్ష్మి, ఆర్యావైశ్యమహాసభ నేతలు హరనాథ్, శరత్ పాల్గొన్నారు.

నర్సరీలు స్వచ్ఛమైన ఆక్సిజన్ ఫ్యాక్టరీలు

ఏఐజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి

కడియం, జనవరి 28: కడియం నర్సరీలు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే ఫ్యాక్టరీలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రశంసించారు. ఆదివారం ఆయన కడియపులంక పుల్లా వీరవెంకటరావు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. వీరికి నర్సరీ రైతు వీరవెంకటరావు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతించారు. నాగేశ్వరరెడ్డి నర్సరీల్లోని వివిధ రకాల మొక్కలను తిలకించారు. కడియం నర్సరీలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య బృందంతో మరోసారి వచ్చి కడియం నర్సరీలను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పుల్లా సత్యనారాయణ(చంటియ్య), పుల్లా ఆంజనేయులు (అబ్బులు), పుల్లా రామరావు, పెద సత్యనారాయణ, వీర్రాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కస్తూరి సుబ్రహ్మణ్యం, పుల్లా శ్రీకాంత్ పాల్గొన్నారు.

500 ఏళ్ల తర్వాత
రాముడు గెలిచాడు..

» భారతదేశ ఉనికి, అస్తిత్వం.. 2024 జనవరి 22న ప్రారంభమైంది

» గుడికట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందాం

» శ్రీపీఠం పరిపూర్ణానంద స్వామి.. వైభవంగా హిందూ సంగమం



రాజమహేంద్రవరంలో కార్యక్రమానికి హాజరైన భక్తజనం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కల్చరల్, జనవరి 28: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ఆదివారం సాయంత్రం 'జై శ్రీరామ్.. భారత్ మాతాకీ జై.. వందేమాతరం' నినాదాలతో మార్మోగింది. కాషాయ జెండాల పరదా కప్పుకొంది. శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ హిందూ సంగమం అంగరరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది హాజరయ్యారు. శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి అభిభాషణం చేస్తూ 'భారతదేశ ఉనికి, అస్తిత్వం 2024 జనవరి 22న ప్రారంభమైందన్నారు. ఆ రోజున ప్రపంచమంతా భారత దేశ గొప్ప తనం, అయోధ్య నగరివైపు చూసిందని తెలిపారు. 524-25 మధ్యలో అయోధ్యలో రామమందిరాన్ని కూల్చేశారు. 500 ఏళ్ల తర్వాత సర్వోన్నత న్యాయస్థానంలో రాముడు గెలిచాడు. రామ మందిరాన్ని నిర్మించుకున్నాం. ప్రధాని మోదీ దేశంలోని ఉజ్జయిని అనే క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. జ్యోతిర్లింగమైన కేదా రినాథ్‌ని ఉద్ధరించి చూపించాడని తెలిపారు. 370 ఆర్టికల్ రద్దు చేసి దేశానికి తలకాయను తగిలించాడన్నారు. శ్రీశైలం క్షేత్రానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయబోతున్నాడన్నారు.గుడి కట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందామా.. గుడి కొట్టేవాడికి ఓటేద్దామా?. మన ఓటు గుడి కట్టేవాడికి మాత్రమే వేయాలని పిలుపునిచ్చారు. హిందూపురంలో కాషాయాన్ని ఎగురవేసి చూపిస్తామన్నారు. ఏప్రిల్‌లో మనం మన చూపుడు వేలుతో సిద్ధంగా ఉండాలి. బేషరతుగా జైశ్రీరాం అంటూ పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి పువ్వు కనిపిస్తే గుద్దేయాలి' అని పరిపూర్ణానంద పిలుపునిచ్చారు. హిందూ జాగరణ సమితి నాయకుడు ఆలే శ్యాం మాట్లాడుతూ హిందువులంతా సంఘటితంగా ఉంటే భారత దేశం బలమైన శక్తిగా విరాజిల్లుతుందన్నారు. స్వాతంత్య్రం వచ్చి 77ఏళ్లు గడిచినా ఇంకా మనకు పూర్తి స్వాతంత్య్రం రాలేదన్నారు. 'దేశంలో మత మార్పిడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు.ఉభయ గోదావరి జిల్లాల్లో దేశంలో ఎక్కడా లేనంతగా జరుగుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరంలోని నందరం గనిరాజు జంక్షన్‌లో అతిత్వరలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు .సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తి ప్రదర్శనలు, గీతాలా పనలు అలరించాయి. కార్యక్రమంలో బీజేపీ నేతలు బొమ్ముల దత్తు, కురగంటి సతీశ్, శ్రీరామ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వైష్ణవ దినేశ్, డాక్టర్ కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తలు

రాజమహేంద్రవరం తరలిన వీహెచ్‌పీ కార్యకర్తలు

కొవ్వూరు, జనవరి 21: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన భారీ హిందూ సంగమం కార్యక్రమానికి కొవ్వూరు ఖండ కార్యావాహ గోవర్దనం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో భారీగా వీహెచ్‌పీ కార్యకర్తలు అధికసంఖ్యలో వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు, కార్యకర్తలు పట్టణ పురవీధుల్లో మోటారుసైకిళ్ల ర్యాలీ చేపట్టారు. మెరకవీధి ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జి మీదుగా ర్యాలీగా రాజమహేంద్రవరం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరావు, టి.భాస్కరరావు, కొవ్వూరు, మద్దూరులంక, వాడపల్లి, పెనకనమెట్ట, సావరం, దొమ్మేరు గ్రామాల నుంచి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టు గోడను ఢీకొని యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన బాలకృష్ణ

దేవరపల్లి, జనవరి 28: బైక్ అదుపుతప్పి జాతీయ రహదారిపై కల్వర్టు గోడను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా కత్తువ మండలం నిగం గ్రామానికి చెందిన కంఠా బాలకృష్ణ(21) నెల్లూరు వైపు వెళ్తుండగా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కల్వర్టు గోడను వేగంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో గోపాలపురం పీహెచ్‌సీకి తరలించగా మృతి చెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, జనవరి 28: ఉమా చోడేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. కొవ్వూరులోని పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రాజమహేంద్రవరానికి చెందిన ఆకెళ్ల సురేష్‌కుమార్, కాశీ కాంచన దుర్గ దంపతులతో కూర్చుని విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి కుంకుమ పూజ, శివునికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో పలువురు అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బొబ్బా భారతి

తాళ్లపూడి, జనవరి 28: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు చాలా ప్రమాదకరమైనదని, తక్షణమే రద్దు చేయాలని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి అన్నారు. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై అవగాహన కార్యక్రమాన్ని తాళ్లపూడి పంచాయతీ వద్ద ఆదివారం నిర్వహించారు. భూహక్కు చట్టం వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. సమావేశంలో న్యాయవాదులు ఏలూరి గోపాలకృష్ణ, వీవీ సుబ్బారావు, మారిశెట్టి సత్యనారాయణ, ప్రకాష్, నాయుడు పాల్గొన్నారు.

ఆగని ఇసుక డ్రెడ్జింగ్



తాళ్లపూడి, జనవరి 28: మండలంలో పేదల పొట్టకొట్టి బహిరంగంగా డ్రెడ్జింగ్ చేస్తూ ఇసుకను వైసీపీ నాయకులు దోచుకుంటున్నారని యువగళం టీం సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం తాళ్లపూడిలోని ఓ రీచ్‌లో పడవ కార్మికులకు చెందిన పడవలను పక్కకు కట్టి దర్జాగా డ్రెడ్జింగ్ చేసి ఇసుకను ఎటువంటి బిల్ లేకుండా విక్రయించుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు చేసిన వ్యక్తులే నేడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో తొండెపు భరత్, నామా సత్యనారాయణ, దండమూడి శేషు, పడవ కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ‘మానవత’ ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, జనవరి 28: ఉండ్రాజవరంలో ఆదివారం మానవత మండల సమావేశం అధ్యక్షుడు తాతిన కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. అనంతరం తాడిపర్రుకు చెందిన వృద్ధురాలి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నందిగం పాపారావు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, సుంకవల్లి వెంకటేశ్వరరావు, కోడూరి ప్రసాద్, ఫణితిని పార్వతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలి

ఉండ్రాజవరం, జనవరి 28: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఆలిండియా ఎస్సీఎస్టీ,బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంఘ మాజీ అధ్యక్షుడు బొడ్డు విక్టర్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని పాలంగి గ్రామంలో స్పందన మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు దళిత ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి గుబ్బల శ్రీనివాస్ దంపతులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుకుమార్, జయరాజు, ఇమ్మానియేలు కె. సత్యనారాయణ, సాక రాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్